# సిద్దిపేట పవర్

ప్రతి క్షణం ప్రజల పక్షం

తెలుగు దినపత్రిక

సోమవారం 17-02-2025 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు | సంపుటి 01 | సంచిక 30 | వెల : 06 రూ



సిద్దిపేట పవర్ తెలుగు దినపత్రిక లో పని చేయుటకు విలేకర్లు కావలెను ఎటువంటి టార్గెట్స్ లేవు. మరిన్ని వివరాలకు సంప్రదించండి


# అలాంటి అధికారులు ఇప్పుడు కనిపించడంలేదు

- హైదరాబాదులో పుస్తకావిష్కరణ కార్యక్రమం
- లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం
- అప్పట్లో అధికారులు నేతలకు దిశానిర్దేశం చేసేవారు
- తప్పులు చేద్దాం అని చెప్పేవాళ్లే ఎక్కువయ్యారని చమత్కారం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాదులో పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రాసిన లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి పుస్తకాన్ని రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఐఏఎస్ అధికారుల సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ గా, మండలి సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఇప్పుడు సీఎంగా అనేకమంది అధికారులను చూస్తూ వస్తున్నానని తెలిపారు. అప్పట్లో అధికారులు ప్రజల మధ్యనే గడిపేవారని అన్నారు. ప్రజాసేవ దిశగా నాయకులకు ఆ అధికారులు దిశానిర్దేశం చేసేవారని వివరించారు. ప్రజలను ఆనందింపజేసేందుకు నేతలు అనేక హామీలు ఇస్తుంటారని, కానీ ఆ హామీల సాధ్యాసాధ్యాలు, లోటుపాట్లను వివరించి నేతలను సరైన దారిలో నడిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పుడు అలాంటి అధికారులు కనిపించడంలేదని విచారం వ్యక్తం చేశారు. తప్పు చేయొద్దు అని చెప్పేవాళ్లకంటే.మూడు తప్పులు చేద్దాం అని



చెప్పేవారే ఎక్కువగా ఉన్నారని సరదాగా వ్యాఖ్యానించారు. కొత్త అధికారులు సీనియర్లను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. అధికారులు ఏసీ గదుల్లో ఉంటే పాలన ముందుకు వెళ్లదని, అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని హితవు పలికారు.

# ఐపీఎల్-2025 షెడ్యూల్

మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్. తొలి మ్యాచ్ లో ఆర్సీబీ ఐ కేకేఆర్. షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ. ఈ వేసవిలో మాంచి క్రికెట్ విందు అందించేందుకు ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) నయా సీజన్ వస్తోంది. ఐపీఎల్-2025 షెడ్యూల్ ను బీసీసీఐ నేడు విడుదల చేసింది. మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ మ్యాచ్ లు జరగనున్నాయి. ఈ సీజన్ తొలి మ్యాచ్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, కోల్ కతా నైట్ రైడర్స్ తలపడనున్నాయి. ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుండగా, ఈ మెగా టోర్నీ ముగిసిన కొన్ని రోజులకే ఐపీఎల్ ప్రారంభం కానుంది. ఐపీఎల్2025లో మే 18తో లీగ్ దశ ముగియనుండగా. మే 20న క్వాలిఫయర్-1, మే 21న ఎలిమినేటర్ మ్యాచ్, మే 23న క్వాలిఫయర్-2, మే 25న ఫైనల్ మ్యాచ్ జరగనున్నాయి.






# కెసిఆర్, రేవంత్ ఇద్దరూ దోపిడీ దొంగలే

వరంగల్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ఉపాధ్యాయ స్థానాలు, ఒక పట్టభద్రుల స్థానం బీజేపీ ఖాతాలో పడతాయని ధీమా వ్యక్తం చేశారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. మేధావులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. వరంగల్ జిల్లాలో నేడు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు బీఆర్ఎస్ పై వ్యతిరేకతతో కాంగ్రెస్‌ను గెలిపించారని, కానీ వారు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి విఫలమైందని, అధికారంలోకి వచ్చాక నిధుల కోసం భూములు అమ్మాలని మాత్రమే ఆలోచిస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కనీసం రంగులు వేయలేని స్థితిలో ఉందని ఆయన అన్నారు.తెలంగాణను బీఆర్ఎస్ కుటుంబ పాలన చేసి అప్పులు చేసిందని, దోచుకుంది అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం దోపిడీ చేసింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే విధంగా వ్యవహరిస్తున్నారు.రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, భూములు అమ్మడం ద్వారా నిధులు సమకూర్చుకోవాలని చూస్తున్నారు. ప్రణాళిక లేని పాలన సాగుతోంది, హామీలు అమలు చేయడంలో అసమర్థతను ప్రదర్శిస్తున్నారు.ప్రజల సమస్యల కోసం బీజేపీ రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించి, తగిన బుద్ధి చెప్పాలంటూ ఉపాధ్యాయులను, పట్టభద్రులను కోరారు.ఇప్పటివరకు ఏ ఒక్క బీసీ సంఘం కూడా కాంగ్రెస్ ప్రభుత్వ సర్వేను సమర్థించలేదని అన్నారు. బీజేపీ ఎప్పటికీ బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.



రాష్ట్రంలో సర్వే పూర్తయి, బీసీ సంఘాలు అనుమతిస్తే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం చేపిస్తామన్నారు. రాహుల్ గాంధీ కులం గురించి సర్వే చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రాహుల్ గాంధీది ఏ కులమో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డే చెప్పాలి అంటూ వ్యాఖ్యానించారు.బీసీల హక్కుల గురించి మాట్లాడే కాంగ్రెస్, తమ నాయకుల కులం వెల్లడించడంలో ఎందుకు వెనుకడుగేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు త్వరలో మారబోతున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. .

# నదీ జలాలను ఏపీ తన్నుకుపోతుంటే సర్కారులో చలనం లేదు

ఏపీ రోజుకు 10 వేల క్యూసెక్కుల నీటిని తీసుకుపోతోందన్న కేటీఆర్. మూడు నెలలుగా తరలించుకుపోతోందని ఆరోపణ. కాంగ్రెస్ సర్కారు అడ్డుకోవడంలేదని ఆగ్రహం తెలంగాణకు దక్కాల్సిన నదీ జలాలను ఏపీ తన్నుకుపోతుంటే రేవంత్ రెడ్డి సర్కారులో చలనం లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా రోజుకు 10 వేల క్యూసెక్కుల నీటిని ఏపీ తరలించుకుపోతోందని ఆరోపించారు. గత మూడు నెలలుగా ఈ తంతు జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం తమాషా చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాడు కేసీఆర్ గోదావరి, కృష్ణా జలాల్లో ప్రతి బొట్టును కూపాడుకుంటూ బీడు భూములను సస్యశ్యామలంగా మార్చారని.కానీ కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలోనే పంట పలాలను బీడుగా మార్చేసిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రాతిపదికన తెలంగాణ



ఏర్పడిందని..అలాంటి రాష్ట్రంలో ఒక్కొక్కటిగా అన్నింటినీ రేవంత్ సర్కారు నాశనం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కృష్ణా జలాల నుంచి 646 టీఎంసీల నీటిని వినియోగించుకున్నా, కాంగ్రెస్ సర్కారు అడ్డుకోవడంలేదని ఆగ్రహం వెలిబుచ్చారు.


# జర్నలిస్టులపై దాడులు అప్రజాస్వామికం

సిద్దిపేట పవర్ దినపత్రిక: జర్నలిస్టులపై దాడులను ఉపేక్షించబోమని, జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీయుడబ్ల్యూజే (ఐజేయూ) డిమాండ్ చేసింది. ఆదివారం రోజున సిద్దిపేట మండలం పుల్లూరు గ్రామంలో సీనియర్ జర్నలిస్టు పరమేశ్వర్ పై జరిగిన దాడిని యూనియన్ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో జిల్లా అధ్యక్షులు రంగాచారి స్పష్టం చేశారు. దాడి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసామని, ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. పరమేశ్వర్ పై జరిగిన దాడికి సంబంధించిన విషయంలో పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్ట్ యూనియన్ నాయకులు నాయిని సంజీవరెడ్డి, రంగదాంపల్లి శ్రీను, ఇంద్ర శేఖర్ ,సాయి గౌడ్, శ్రీకాంత్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధిపేటలో పాలు వివాహాలకు హాజరైన ప్రముఖులు





సిద్ధిపేటలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి కుమారుడు శ్రీకర్ – మనస్విని వివాహానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు. మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు, కల్వకుంట్ల కవిత, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు,ఎమ్మెల్యేలు డాక్టర్. పల్లా రాజేశ్వర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి పాడి కౌశిక్ రెడ్డి,ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,మాజీ కార్పోరేషన్ చైర్మన్ లు హాజరయ్యారు.

# మీరా అప్పుల గురించి మాట్లాడేది?

పదేళ్ల పాలన తర్వాత కూడా తెలంగాణ మిగులు రాష్ట్రమేనని కేటీఆర్ వెల్లడి అప్పులు చేసినా ప్రజల కష్టాలు తీర్చామని వివరణ ప్రతి బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు లేఖ రాశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన తర్వాత కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమేనని స్పష్టం చేశారు. మేం చేసిన అప్పులతో తెలంగాణ ప్రజల కష్టాలు తీర్చాం. తెలంగాణ దశ దిశను మార్చాం. తెలంగాణకు తరగని ఆస్తులు సృష్టించాం అని వెల్లడించారు. దేశ చరిత్రలోనే అత్యధికంగా అప్పులు చేసిన మీరా మాపై అభాండాలు వేసేది? మీ అప్పులన్నీ కార్పొరేట్ శక్తుల రుణాల మాఫీ కోసమే అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రతి బడ్జెట్ లో తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నారు. బీజేపీని తెలంగాణ ప్రజలు క్షమించరు అని స్పష్టం చేశారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పదేళ్లలో తీసుకువచ్చిన రూ.125 లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పాలని కేటీఆర్ నిలదీశారు. 14 మంది ప్రధానులు 65 ఏళ్లలో రూ.56 లక్షల కోట్లతో అప్పులు చేస్తే. పదేళ్లలోనే బీజేపీ ప్రభుత్వం రూ.125 లక్షల కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. అప్పులపై మాట్లాడే హక్కు బీజేపీ ప్రభుత్వానికి లేదని తన లేఖలో పేర్కొన్నారు.



# తొక్కిసలాట ఘటనపై దర్యాప్తునకు రైల్వే శాఖ ద్విసభ్య కమిటీ

న్యూఢిల్లీ: ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రయాణికులు మృతి చెందిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు మొదలైంది. ఘటనపై దర్యాప్తు జరిపేందుకు ద్విసభ్య కమిటీని రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. నార్తరన్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నర్సింగ్ డియో, ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ కమిషనర్ పంకజ్ గాంగ్వార్‌లతో ఈ కమిటీ ఏర్పాటు చేసినట్టు




రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఘటనపై ఈ కమిటీ అత్యున్నత స్థాయి విచారణ జరుపుతుందని పేర్కొంది. దర్యాప్తులో భాగంగా రైల్వేస్టేషన్‌లోని వీడియా ఫుటేజ్‌లన్నీ భద్రం చేయాలని కమిటీ ఆదేశాలిచ్చింది. ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పాల్గొనేందుకు న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌కు భారీ సంఖ్యలో ప్రయాణికులు చేరుకోవడంతో శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 18 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మృతులలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. వీరిలో ఆహా దేవి (79), పింకీ దేవి (41), షీలా దేవి (50), వ్యోమ్ (25), పూనమ్ దేవి (40), లలితా దేవి (35), సురుచి (11), కృష్ణాదేవి (40), విజయ్ సహ్ (15), నీరజ్ (12), శాంతిదేవి (40) పూజ కుమార్ (8), సంగీత మాలిక్ (34), పునమ్ (34), మమతా ఝా (40), రియా సింగ్ (7), బేబీ కుమారి (24), మనోజ్ (47) ఉన్నారు. కాగా, మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షలు పరిహారం ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష పరిహారం ఇవ్వనున్నట్టు ప్రకటించింది. క్షతగాత్రులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.




# రాజీవ్ గాంధీ హిందువే కాదు : కేంద్ర మంత్రి బండి సంజయ్

- ఆయన తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్శీ
- ఫిరోజ్ పూర్వీకులు ముస్లిం సంతతికి చెందిన వారు
- రాజీవ్ గాంధీ భార్య సోనియా ఇటలీ దేశ క్రైస్తవురాలు
- మరి రాహుల్ గాంధీ హిందువు ఎట్లా అవుతారు
- కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలి
- బీసీలకు అన్యాయం చేసేందుకే కులగణన



కరీంనగర్,: రాజీవ్ గాంధీ అసలు హిందువే కాదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్వదేశీ మేళా" ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలు టీవీల్లో చూసిన తండ్రి కులమే కొడుకుకు వర్తిస్తుందని రాజీవ్ గాంధీ హిందువు అయినందున ఆయన కుమారుడు రాహుల్ గాంధీ కూడా హిందువేనని ఇయాళ కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు రాజీవ్ గాంధీ హిందువు ఎట్లా అవుతాడని, రాజీవ్ గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్శీ మతస్థుడన్నారు. పర్శియాలోని ముస్లిం సంతతికి చెందిన వాళ్ల పూర్వీకులు ఇండియాకు వచ్చి పార్శీలుగా మారారన్నారు. ఫిరోజ్ జహంగీర్ ఖాన్ మతమే రాజీవ్ గాంధీకి వర్తిస్తుందని కాబట్టి రాజీవ్ గాంధీ అసలు హిందూ కానేకాదన్నారు. సోనియా గాంధీ ఇటలీ దేశానికి చెందిన క్రైస్తవురాలు అన్నారు. రాజీవ్ గాంధీ ముస్లిం మూలాలున్న పార్శీ మతస్తుడని, సోనియాగాంధీ క్రైస్తవురాలనారు. టెన్ జన్ పథ్ లోని రాహుల్ గాంధీ కుటుంబానికి కులం, మతం, జాతి, దేశం లేదన్నారు. కానీ మోదీ పక్కా ఇండియన్ అని, మోదీకి విదేశీయులే సాష్టాంగ నమస్కారం చేస్తున్నారన్నారు. విదేశాల్లో ప్రతి భారతీయుడు గర్వంగా ఇండియన్ అని కాలర్ ఎగరేసి తలెత్తుకుని తిరిగేలా చేస్తున్నారన్నారు. బీసీ కుల గణన పేరుతో హిందువులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు. ఒక వర్గానికి, మతానికి కొమ్ము కాసేందుకు కాంగ్రెస్ నేతలు బీసీల జనాభా తగ్గించే కుట్ర చేస్తున్నారు. 10 శాతమున్న ముస్లింలను బీసీల్లో కలిపారని,42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అందులో 10 శాతం ముస్లింలకే చెందుతాయన్నారు. ఈ లెక్కన బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తాయని, మరి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరువల్ల బీసీ న్యాయం కంటే అన్యాయం ఎక్కువ జరుగుతోందని, మహారాష్ట్రలో మాదిరిగా మత మార్పిడులు, లవ్ జిహాదీలపై చట్టం తీసుకురావాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించిందని, అట్లాంటి చట్టమే తెలంగాణలోనూ తీసుకురావాలన్నారు. అంతే తప్ప ముస్లింలను బీసీ జాబితాలో కలిపి కేంద్రానికి పంపితే ఆ జాబితాను కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. ఇందులో ఎలాంటి మొహమాటం లేనేలేదని, హిందూ ధర్మ సమాజం కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. మమ్మల్ని మతతత్వ వాదులుగా ముద్రవేసే భయపడే ప్రసక్తే లేదని, ఇకనైనా బీసీ జాబితాలో నుండి ముస్లింల జనాభాను తీసేసి కేంద్రానికి పంపిస్తే తప్పనిసరిగా ఆ జాబితా ఆమోదం పొందేలా చేస్తామన్నారు.